సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం। 4। మే। 2023



వెంకన్న ఆలయంలో సదస్సు

బోయినపల్లి(చొప్పదండి): తడగొండలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణంలో భాగంగా బుధవారం రాత్రి సదస్సు నిర్వహించారు.



ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు సన్మానం

వేములవాడ: రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం నాయకులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, సిరిగిరి శ్రీరాములు, ప్రతాప నవీన్‌లు ఎమ్మెల్యే రమేశ్‌బాబును సన్మానించారు.

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాజన్న సేవలో దేవాదాయశాఖ మంత్రి



స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు

వేములవాడ: రాజన్నను రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అద్దాల మండపంలో ప్రసాదాలు అందించి సత్కరించారు. ఆర్డీవో పవన్‌కుమార్, తహసీల్దార్ రాజారెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రాణాదివస్‌ను సద్వినియోగం చేసుకోండి



అఖిల్ మహాజన్, ఎస్పీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట పోలీసు స్టేషన్‌లో ఈనెల 4న నిర్వహించే రాణాదివస్‌ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో కోరారు. గురువారం ఉదయం 10.30 నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

జిల్లా వ్యవసాయాధికారిగా భాస్కర్



భాస్కర్
జిల్లా వ్యవసాయాధికారి

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయాధికారిగా వి.భాస్కర్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి నియమించారు. జిల్లా వ్యవసాయాధికారిగా ఉన్న రణధీర్‌రెడ్డిని మంగళవారం సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో వేములవాడలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న భాస్కర్‌ను ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారిగా నియమించారు. జిల్లాలో గత పది రోజులుగా వడగండ్ల వానలు కురిసి రైతులు పంటలు నష్టపోయారు. క్షేత్రస్థాయిలో పంటనష్టం వివరాల నివేదికలు తయారు చేయడంలో విఫలమయ్యారని జిల్లా వ్యవసాయాధికారిగా ఉన్న రణధీర్‌రెడ్డిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో భాస్కర్‌ను నియమించారు.

'జిజ్ఞాస'లో మెరిసిన డిగ్రీ విద్యార్థులు



జిజ్ఞాసలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత

గంభీరావుపేట(సిరిసిల్ల): హైదరాబాద్‌లో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీల్లో గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వృక్షశాస్త్రం, భౌతికశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించి అందరితో శభాష్ అనిపించుకున్నారు. విద్యార్థులను, సబ్జెక్టు టీచర్లను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ పిట్ల దాసు అభినందించారు.

మానసిక సమస్య పరిష్కార 'కిరణం'

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో ఆత్మస్థైర్యం కోల్పోయిన జీవితాలకు మనోధైర్యాన్ని ఇచ్చేందుకు కౌన్సెలింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్‌లో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు, వైద్యాధికారులతో కలిసి ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్‌ను విడుదల చేసి, పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మానసిక సమస్యలతో బాధపడుతుంటే కౌన్సిలింగ్ కోసం 1800 425 3333 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయవచ్చన్నారు. సైకాలజిస్టులు అందుబాటులో ఉంటారని, అవసరమైతే వైద్యశాలలో చికిత్సలు కూడా అందిస్తారన్నారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రావు, సైకియాట్రిస్టు డాక్టర్ సతీశ్, ప్రవీణ్, నయీం, సైకాలజిస్టు పున్నం చందర్ పాల్గొన్నారు.

నమ్మించి.. కాజేసి

- మిడ్‌మానేరు నిర్వాసితుల ప్లాట్లు మాయం
- మాయమాటలతో బురిడీ కొట్టించిన ప్రజాప్రతినిధి
- ప్లాట్లు ఇప్పిస్తానంటూ బంధువుల పేరిట రిజిస్ట్రేషన్
- లబోదిబోమంటున్న నిర్వాసితులు
- న్యాయం చేయాలని వేడుకోలు

వేములవాడ: భూమి ఇప్పిస్తానని నమ్మించి ఏకంగా ఆ భూమినే కాజేసిన వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రజాప్రతినిధి కదా అని నమ్మకం పెట్టుకుంటే తెల్లకాగితాలపై సంతకాలు తీసుకొని నిర్వాసితుల భూములను తన బంధువులు పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. మార్కెట్ విలువ ప్రకారం ఆ ప్రజాప్రతినిధి కాజేసిన భూముల విలువ దాదాపు రూ.2కోట్లకు పైగానే ఉంటుందని తెలుస్తోంది. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు. తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

అమాయకులే టార్గెట్

రాజన్నసిరిసిల్ల జిల్లాలో వేములవాడ అర్బన్ మండలంలోని మధ్యమానేరు నిర్వాసితులకు పునరావాస కాలనీలు ఏర్పాటు చేశారు. మిడ్‌మానేరులో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఆర్‌అండ్ఆర్ కాలనీల్లో ఇళ్ల స్థలాలు అందజేశారు. అయితే ఆ స్థలాలను అమ్ముకునే అవకాశం ఇటీవల ప్రభుత్వం కల్పించింది. దీన్నే క్యాష్ చేసుకోవాలనుకున్న ఓ ప్రజాప్రతినిధి తన వంకరబుద్ధికి పనిచెప్పాడు. అమాయకులను ఎంచుకొని.. వారికి భూమి ఇప్పిస్తానంటూ నమ్మించి ఏకంగా వారికి మంజూరైన ప్లాట్లను కాజేశాడు. తన బంధువుల పేరిటా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు.

ఇలా కాజేశాడు..

- వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన పర్వతి నర్సయ్య సోదరులు, తునికి ఎల్లవ్వ, పచ్చిమట్ల మంజుల, గుండేటి బుజ్జవ్వ కుటుంబీకులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చింది.
- వారి పేరిట ప్లాట్లు మంజూరు చేయిస్తానని నమ్మించిన ఓ ప్రజాప్రతినిధి శ్మశానవాటిక వద్ద స్థలం చూపించాడు.
- రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని కొడుముంజ, శాభాష్‌పల్లికాలనీల్లోని నిర్వాసితుల పేరిట ఉన్న ప్లాట్లను తన కుటుంబీకుల పేరిటా బదలాయించుకున్నాడు.
- ప్రాజెక్టులో భూములు కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబాలను సదరు ప్రజాప్రతినిధి నిండా ముంచేశాడు. వారి పేరిట ఉన్న ఇళ్ల స్థలాలను సైతం కాజేశాడు. ఆ స్థలాల విలువ దాదాపు రూ.2కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది.
- ఈ విషయం తెలుసుకున్న బాధిత కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. తమకు న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.



ఒకే కుటుంబానికి చెందిన వీరు పర్వతి నర్సయ్య–సావిత్రి, పర్వతి కనకయ్య– మంగవ్వ దంపతులు. వీరికి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పాట్లు వచ్చాయి. వీరి తల్లి పేరుతో మరో ప్లాటు మంజూరైన తర్వాత ఆమె అనారోగ్యంతో చనిపోయింది. ఈ ప్లాట్ మంజూరు చేయిస్తానని ఓ ప్రజాప్రతినిధి నమ్మించాడు. శ్మశానవాటిక వద్ద రెండు గుంటల ప్లాటు ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నాడు. అధికారుల అండదండలతో కొడుమంజు ప్రాంతంలో ప్లాటు పొందాడు. వీరికి తెలియకుండానే సంతకాలు చేయించుకుని వీరి పేరిట మంజూరైన ప్లాటును తన కొడుకు పేరిటా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు.

న్యాయం చేయండి

మా ఆడబిడ్డ బుజ్జవ్వకు పెళ్లి కాలేదు. గ్రామస్తుల సహకారంతో బుజ్జవ్వ పేరుతో ప్లాటు మంజూరైంది. బుజ్జవ్వకు మాయ మాటలు చెప్పి సదరు ప్రజాప్రతినిధి ఆ ప్లాటును తన భార్య పేరుకు మార్చుకున్నాడు. ఈ విషయం నాకు తెలిసి గ్రామ పంచాయతీకి పిలిపించి అడిగితే.. బుజ్జవ్వ వద్ద కొన్నానని బుకాయించిండు. నాకు భర్తలేడు. నా అత్త, ఆడబిడ్డ, నా కూతురు పెళ్లి అయి ఇంట్లోనే ఉంటున్నారు. ఇన్ని కష్టాల్లో ఉన్న మమ్ములను ఇలా ఇబ్బంది చేసుడు న్యాయమా?

– గుండేటి రాజేశ్వరి, కూతురు మౌనిక





రూ.40 లక్షల ప్లాట్ కాజేసిండు

పట్టా ఇప్పిస్తామని రూ.40 వేలు తీసుకున్నారు. రుద్రవరం శ్మశానవాటిక వద్ద స్థలం వస్తుందని చెప్పిండు. ఆధార్‌కార్డు, ఫించన్ రాకుండా చేస్తానని బెదిరించి.. మాతో సంతకాలు తీసుకున్నడు. మాకు మంజూరైన పట్టాను తన భార్య పేరిటా చేయించుకున్నడు. నేను పేదరాలినని నా ప్లాట్ ఇవ్వాలని ప్రాధేయపడితే ఆరు నెలల క్రితం రూ.3 లక్షలు ఇచ్చిండు. ఇదే మిటంటే బెదిరిస్తున్నడు. రూ.40 లక్షల విలువైన ప్లాట్‌ను కాజేసిండు.

– పచ్చిమట్ల మంజుల, తల్లి సూరవ్వ

మా ప్లాట్ ఇప్పించండి



రుద్రవరం శ్మశానవాటిక వద్ద స్థలం ఇప్పిస్తానని 2020లో రూ.లక్ష తీసుకున్నాడు. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీసుకు తీసుకెళ్లి సంతకాలు పెట్టించుకున్నాడు. మాకు శాభాష్‌పల్లికాలనీలో మంజూరైన పట్టాను మా ఊరి ప్రజాప్రతినిధి కొడుకు పేరిటా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తలా గుంట జాగా ఇస్తామని చెప్పారు. మా ప్లాటు మాకు ఇప్పించండి.

– తునికి ఎల్లవ్వ–రఘు

తడిసిన ధాన్యాన్ని కొంటాం

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో మద్దతు ధరకే తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొంటుందని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం సివిల్ సప్లయ్ అధికారులు, రైస్‌మిల్లర్లతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. అకాల వర్షాలతో తడిసి రంగు మారినా, తేమ శాతం 17 కంటే అటు, ఇటుగా ఉన్నా వడ్లు సైతం తీసుకుంటామన్నారు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో రైస్‌మిల్లర్లు రైతులకు అండగా ఉండాలని కోరారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయించాలని సూచించారు. డీఎస్‌వో ఎస్.జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

కేంద్రం ఎకరాకు రూ.20వేలు చెల్లించాలి



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేలు ప్రకటించిందని, దానికి తోడుగా కేంద్ర ప్రభుత్వం రూ.20వేలు ఇచ్చేలా ప్రకటన చేయించిన తర్వాతే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గ్రామాల్లో పర్యటించాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు డిమాండ్ చేశారు. గంభీరావుపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సుమారు 20వేల ఎకరాల్లో వరి పంట నష్టం జరిగినట్లు అధికారులు నివేదికలు అందించారని.. రైతులు అధైర్య పడవద్దని కోరారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని సైతం కొంటామని తెలిపారు. కొత్తపల్లి సింగిల్‌విండో చైర్మన్ భూపతి సురేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు అహ్మద్, నాయకులు దయాకర్‌రావు, గంధ్యాడపు రాజు, మహబూబ్ అలీ, కరువారి శంకర్, హన్మంతరెడ్డి, లింగంయాదవ్, దోసల రాజు, శేఖర్‌గౌడ్, రాజిరెడ్డి, వహీద్, రత్నాకర్, అభిలాశ్ పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టించుకోరా ?!

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్
- జిల్లాలో పంటనష్టం పరిశీలన



తంగళ్లపల్లిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/గంభీరావుపేట(సిరిసిల్ల): అకాల వర్షాలతో రైతులు ఆగమవుతుంటే సచివాలయం ప్రారంభమంటూ సీఎం కేసీఆర్ అన్నదాతల గోడు పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. జిల్లాలోని గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి మండలాల్లో బుధవారం పర్యటించి పంటనష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనాలని కోరారు. గంభీరావుపేట మండలంలోని నాగంపేటలో వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. సముద్రలింగాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. మండలాల అధ్యక్షులు పొన్నాల తిరుపతిరెడ్డి, గంట అశోక్, నాయకులు రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పర్శరాములు, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, స్వామి, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, సెస్ మండల మాజీ డైరెక్టర్ కొక్కు దేవేందర్‌యాదవ్,

'నెల జీతం లంచమిస్తే వెంటనే రెగ్యులర్ చేస్తాడు'

పంచాయతీ కార్యదర్శులు నెల జీతం ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు లంచంగా ఇస్తే వెంటనే రెగ్యులరైజ్ చేస్తారని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. తంగళ్లపల్లిలోని దీక్షా శిబిరంలో కూర్చున్న జేపీఎస్, ఓపీఎస్‌లను పరామర్శించి మద్దతు ప్రకటించారు. జేపీఎస్, ఓపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. జీవో 317 సవరించేలా ప్రభుత్వానికి విన్నవించాలని కోరుతూ తంగళ్లపల్లి ఇన్‌చార్జి ఎంపీవో శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రేడ్–1, గ్రేడ్–2 పంచాయతీ కార్యదర్శులు ఎంపీకి వినతిపత్రం అందించారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, లగిశెట్టి శ్రీనివాస్, చక్రధర్‌రెడ్డి, రెడ్డబోయిన గోపి, సురువు వెంకట్, గజభీంకార్ సంతోష్, కోల ఆంజనేయులు, అన్నల్‌దాస్ వేణు, శీలం రాజు, బూర విష్ణు, సిరిసిల్ల వంశీ, జేపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి ప్రవీణ్, వివిధ మండలాల అధ్యక్షులు కె.జనార్దన్, ఎంబడి అనిల్, అజ్మీర లింగామూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు నిర్వాసితులకు అండగా ఉంటామని బండి సంజయ్ భరోసానిచ్చారు. వేములవాడ మండలం చీర్లవంచ, రుద్రవరం గ్రామాల్లోని ముంపు గ్రామాల ఐక్యవేదిక నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిర్వాసితులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు. ముంపు గ్రామాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సీఎం కేసీఆర్ ప్రతిపాదనలు పంపిస్తే తప్పకుండా కేంద్రం నుంచి సహకరిస్తామని స్పష్టం చేశారు. నిర్వాసితుల గ్రామాల్లో ఉపాధి లేక యువకులకు పెళ్లికావడం లేదన్నారు. ఐదు నెలలు ఆగండి బీజేపీ ప్రభుత్వం వస్తుందని.. అన్ని సమస్యలు తీరుతాయన్నారు. నిర్వాసితుల నిరవధిక నిరాహార దీక్షకు మద్దతు ప్రకటించారు. జేఏసీ నాయకులు పిల్లి కనకయ్య, ఎర్రం మహేశ్, ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి, బీజేపీ మండలాధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, వేములవాడరూరల్ ఎంపీపీ బండ మల్లేశం, బుర్ర శేఖర్‌గౌడ్, రేగుల మల్లికార్జున్, మోహన్‌రావు, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వానగండం వీడలే..!

- మరో నాలుగు రోజులు వానలు కురిసే అవకాశం
- ఉమ్మడి జిల్లాకు పొంచి ఉన్న ఈదురుగాలుల ముప్పు
- ఇప్పటికే 2 లక్షల ఎకరాల్లో రైతులకు పంటనష్టం
- పాత జిల్లాలో సాధారణానికి మించి కురిసిన వాన

మార్చి ఒకటో తేదీ నుంచి మే మూడో తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో సగటు వర్షపాతం

జిల్లా	అసలు (మి.మీ)	సాధారణం (మి.మీ)	వ్యత్యాసం
కరీంనగర్	173.3	33.9	411
జగిత్యాల	114.1	39.5	189
పెద్దపల్లి	121.1	29.6	309
రాజన్నసిరిసిల్ల	161.6	40.8	296

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జిల్లారైతులపై ప్రకృతి ప్రకోపం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఏప్రిల్ నెలలో మొదలైన వరుణిడి ప్రతాపం.. మే నెలలోనూ కొనసాగేలా ఉంది. ఈనెల 4,5,6,7వ తేదీల్లోనూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణశాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురవవచ్చని తాజాగా విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. గత ఏప్రిల్‌లో వరుసగా వడగండ్లు, అకాల వర్షాల కారణంగా వేలాది ఎకరాల్లో పంటనష్టం జరిగింది. గత వందేళ్లలో రాష్ట్రంలో ఏనాడూ చూడని చెడగొట్టు వానలని ప్రభుత్వమే అభివర్ణించడం ప్రస్తుత పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ముఖ్యంగా ఏప్రిల్ 22,24,30వ తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు పెద్దఎత్తున పంటనష్టం చేకూరింది. ఆరుగాలం శ్రమించిన పంట వడగండ్ల దెబ్బకు ధ్వంసం కావడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మరోవైపు కల్లాల్లో తడిసిన ధాన్యం కొంటామని, ఎకరానికి రూ.10వేల పంట నష్టపరిహారం ఇస్తామన్న ప్రభుత్వ హామీతో పరిహారం కోసం కోటికళ్లతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏ జిల్లాలో ఎలా అంటే

ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంనగర్‌లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. వీటి ప్రభావం జగిత్యాల, సిరిసిల్లలో తక్కువగా కరీంనగర్, పెద్దపల్లిలో అధికంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షంకురిసినా.. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పోలీసులు, రెవెన్యూ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలని ముందుజాగ్రత్తగా సూచనలు కూడా చేసింది. కరీంనగర్ జిల్లాలో తాజా సమాచారం ప్రకారం.. 56,066 ఎకరాలు, జగిత్యాలలో 65,794 ఎకరాలు, సిరిసిల్లలో 18,230 ఎకరాలు, పెద్దపల్లి 36,596 ఎకరాల మేర పంటలు నాశనమయ్యాయి. ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాలో 1,76,686 ఎకరాల్లో పంట నష్టపోయిందని, ఇది దాదాపు రెండు లక్షల ఎకరాల వరకు చేరుకునే అవకాశముందని సమాచారం. ఇప్పటి వరకూ ప్రాథమిక నష్టంగా అంచనా వేసిన ప్రభుత్వం దీనిపై త్వరలోనే తుది నివేదిక రూపొందించిన అనంతరం రైతులకు పరిహారం విడుదల చేయనుంది. ఇప్పటికే అనేక గండాలు దాటుకున్న రైతన్న రాబోయే నాలుగురోజులు కూడా విషమపరీక్షే ఎదుర్కొవాల్సి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వరికోతలు ఇప్పుడే చేపట్టవద్దని వానల గండం తొలిగాక చేపట్టడం మంచిదని సూచిస్తున్నారు. మిగిలిన వాణిజ్య పంటల విషయంలో సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.



చిన్నబోనాలలో మొలకెత్తిన ధాన్యం

దంచి కొట్టిన వానలు

మండువేసవిలో అకాల వర్షాలు వానాకాలాన్ని తలపించాయి. ఒకదశలో భారీవానలు రెండుమూడు రోజులపాటు తుపానును తలపింపజేశాయి. ఈ సీజన్‌లో కురవాల్సిన వానల కన్నా అధికంగా కురిశాయని వాతావరణశాఖ వెల్లడించింది. సాధరణంగా వేసవిలో అసలు వానజాడ కానరాదు. కానీ, ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ప్రకృతి పగబట్టినట్లుగా ఒకదాని తరువాత మరొకటి, వరుసగా భారీ వానలు, వడగండ్లు, ఈదురుగాలులు రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. ఈ సీజన్‌లో సగటున 3 సెం.మీల వర్షపాతం నమోదైతే అది సాధారణ వర్షపాతం కింద లెక్క. కానీ విచిత్రంగా ఉమ్మడి జిల్లాలో కనిష్టంగా 11 సెం.మీల నుంచి గరిష్టంగా 17 సెం.మీల వరకు కురవడంపై వ్యవసాయశాఖ అధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్, సిరిసిల్లలో వానలు దంచికొట్టగా.. జగిత్యాల, పెద్దపల్లిలోనూ బాగానే కురిశాయి.

అక్రమ లే అవుట్‌లను తొలగించండి

- అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో అక్రమ లే అవుట్‌లను వెంటనే తొలగించాలని, వాటిని ఉపేక్షించొద్దని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం మున్సిపల్, సెస్, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. కమర్షియల్, నివాస సముదాయాల్లో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. సిరిసిల్లకు 28 కమ్యూనిటీహాల్స్ మంజూరు కాగా, ఇప్పటి వరకు 15 భవనాలు ప్రారంభమయ్యాయని, మిగతా 13 పనులు వెంటనే ప్రారంభించేలా టెండర్లు పిలవాలని ఆదేశించారు. పెద్దూరు మెడికల్ కాలేజీ పక్కన చేపడుతున్న మోడల్ టౌన్‌షిప్ లేఅవుట్ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. శాంతినగర్‌లో చేపట్టిన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు(ఎస్‌టీపీ)ను ఆగస్టు 15నాటికి పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. బైపాస్ రోడ్ల వెంట మొక్కలు నాటాలని సూచించారు. జూనియర్ కాలేజీ మైదానంలో జూన్ 2 నాటికి గ్రౌండ్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. సిరిసిల్ల పట్టణ పరిధిలోని శాంతినగర్, పెద్దూరు, రగుడు వద్ద డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేయాలన్నారు. సిరిసిల్ల తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, 'సెస్' ఎండీ రామకృష్ణ, టీపీవో అన్సారీ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా దృష్టి పెట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీమీటింగ్ హాల్‌లో సమీక్షించారు. మాతృత్వ మరణాలకు ఆస్కారం లేకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత నెలలో జిల్లాలో మొత్తం 512 ప్రసవాలు జరిగాయని, వీటిలో ప్రభుత్వాస్పత్రుల్లో 280, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 231 జరిగినట్లు అధికారులు వెల్లడించారు. అంబేడ్కర్‌నగర్ పరిధిలో 60 శాతానికి పైగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోగ్యమహిళ పక్షల్లో జాప్యం చేయొద్దన్నారు. నెలాఖరులోపు జిల్లా ఆస్పత్రిపైన అదనపు బ్లాక్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. నెలలోపు వేములవాడ డయాలసిస్ యూనిట్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, ఉపవైద్యాధికారి రజిత, ఆసుపత్రి సూపరింటెండెంట్‌లు మురళీధర్‌రావు, మహేశ్‌రావు, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

బోయినపల్లి చొప్పదండి: విలాసాగర్‌లో జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో బుధవారం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారివెంట కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, నాయకులు పులి లక్ష్మిపతి, ఏనుగుల కనుకయ్య, ఏనుగుల ప్రశాంత్‌కుమార్ తదితరులున్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత


గోవర్ధన్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన బొల్గం వరలక్ష్మి-శ్రీనివాస్ దంపతుల కూతురు సంజన ఉన్నత చదువుల కోసం జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ బుధవారం ల్యాప్‌టాప్‌ను అందించారు. సంజన బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండగా జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్ గౌడ్ రూ.70 వేల విలువ గల ల్యాప్‌టాప్‌ను అందించారు. అనంతరం గోవర్ధన్ గౌడ్‌ను గ్రామ గౌడసంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొండ రమేశ్‌గౌడ్, కదిరె భాస్కర్, అమరేందర్, పాముల దేవయ్య, లింగాల నరేందర్, పాముల దేవరాజు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): గీత కార్మికులకు ప్రమాద బీమా పథకాన్ని వర్తింపజేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ మాట్లాడుతూ.. గీత కార్మికులు తాటిచెట్టుపై నుంచి పడి మరణించిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందించ డం శుభ సూచకమన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్, నాయకులు కొండ రమేశ్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, నారాయణగౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఉపేందర్ గౌడ్, సుధాకర్‌గౌడ్, పర్శరాములుగౌడ్, శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

హరిదాస్‌నగర్, దుమాలలో..


సఫాయి కార్మికులకు రూ.వెయ్యి జీతం పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని హరిదాస్‌నగర్, దుమాల గ్రామాల్లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సర్పంచులు కదిరె రజిత, అమృత, ఎంపీటీసీ మల్లేశం, కార్యదర్శులు మహేందర్, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో..

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్లలో జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. గీత కార్మికులు తాటిచెట్లు ఎక్కే క్రమంలో ప్రమదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తింపజేయాలని సీఎం కేసీఆర్ ప్రకటించడం హర్షణీయమన్నారు. గోపా జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌గౌడ్, విక్రుతి లక్ష్మీనారాయణ గౌడ్, బాలరాజ్ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం కోశాధికారి రమేశ్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, రాజుగౌడ్, శ్రీనివాస్ గౌడ్, దేవయ్యగౌడ్, శ్రీధర్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులున్నారు.

పర్యాటకం కలేనా?

- ప్రాచీన బౌద్ధ స్తూపాన్ని మరిచిన పాలకులు
- పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి
- రోడ్డు, వసతులు లేక ఆసక్తిచూపని పర్యాటకులు
- ఈనెల 5న బౌద్ధ జయంతి



ఎలిగేడు/జూలపల్లి: బౌద్ధమత బోధనలతో ఫరిడవిల్లిన నేల ధూళికట్ట. గత అనుభవాన్ని ఈతరం ప్రజలు గుర్తుచేసుకుంటూ.. రాబోయే తరానికి అందించాల్సిన పూర్వీకుల చరిత్ర, సంప్రదాయ వారసత్వ వైభవం ఉన్న అపురూప ప్రదేశం. ఇక్కడి బౌద్ధస్తూపం తెలంగాణకే తలమానికం. ఇంతటి వైభవం ఉన్న ఈ ప్రాంత అభివృద్ధిని పాలకులు విస్మరించడం గమనార్హం.

రెండు మండలాల సరిహద్దులో..

ఎలిగేడు మండలం ధూళికట్ట, జూలపల్లి మండలం వడుకాపూర్ గ్రామాల సరిహద్దులో.. హుస్సేన్‌మియావాగు తీరాన ఉంది బౌద్ధస్తూపం. ధూళికట్టలో కోటలు, శాతవాహన రాజుల కాలం నాటి ఆనవాళ్లు ఉన్నాయి. ఆరో శతాబ్దంలో బాదనకుర్తిలో నివసించిన బావరి మహర్షి ఆహ్వానం మేరకు గౌతమ బుద్ధుడు ధూళికట్టలో పర్యటించినట్లు చరిత్ర చెబుతోంది. హుస్సేనిమియావాగు తీరంలో గౌతముడు ఏడువారాలపాటు గడిపాడనీ ప్రతీతి. శాతవాహన రాజుల కాలంలో ధూళికట్టలో రాజభవనాలు ఏర్పాటుచేసుకుని హుస్సేనిమియావాగు తీరంలో కోటలు, బౌద్ధస్తూపాన్ని నిర్మించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. కోటలను మట్టితో నిర్మించడంతో ధూళికోటగా పిలిచేవారనీ, కాలక్రమేణా ధూళికట్టగా మారిందని చెబుతుంటారు.

వెలుగుచూసింది ఇలా..

శాతవాహనుల రాజులకాలంనాటి సంస్కృతి, సంప్రదాయాలను వెలికి తీసేందుకు 1972లో అప్పటి పురావస్తుశాఖ నిపుణులు డాక్టర్ వీవీ.కృష్ణశాస్త్రి, కర్నాటకకు చెందిన స్వర్గీయ ఠాకూర్ రాజారాంసింగ్, డాక్టర్ గురు రాజారావు ఆధ్వర్యంలో ధూళికట్టలో తవ్వకాలు చేపట్టి, పరిశోధనలు చేశారు. ఇందులో శాతవాహనుల కాలం నాటి బౌద్ధస్తూపం, కోట ముఖద్వారం, ఐదుపడగల ముచిలిందనాగం, భోదివృక్షం, యక్షనులు, స్తూప నమూనాలు, మహాభినిష్క్రమణం, బుద్ధుని ప్రతిమలు, రాగినాణేలు, మట్టిబొమ్మలు, కుమ్మరి గాజులు, మృణ్మయ పాత్రలు వెలుగుచూశాయి. ఆనాటి ప్రజలు ప్రాకృతభాష, బ్రహ్మలిపి వాడినట్లు గుర్తించారు. బౌద్ధస్తూపాన్ని 19గుంటల స్థలంలో 36మీటర్ల వ్యాసార్థంతో చతురాస్రాకారంలో కాల్చిన ఇటుకలను మందంగా తయారు చేయించి వాడినట్లు ధ్రువీకరించారు. ఇక్కడ లభించిన సున్నపు పలకలు, స్తూప నమూనా ఫలకాలు ఇప్పటికీ కరీంనగర్‌లోని పురావస్తు శాఖ మ్యూజియంలో ఉన్నాయి.

అభివృద్ధికి రూ.39 లక్షలు

ధూళికట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 2002లో అప్పటి ప్రభుత్వం బౌద్ధ స్తూప పునఃనిర్మాణానికి రూ.39 లక్షలు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించింది. సదరు కాంట్రాక్టర్ స్తూపానికి వాడే ఇటుకలను ప్రత్యేకంగా తయారు చేయించి తెప్పించారు. ఏమైందో తెలియదుగానీ.. కొంతమేర నిర్మాణం చేసి పనులు నిలిపివేశారు. అనంతరం అప్పటి పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్ తన కోటా నుంచి రూ.50లక్షలు కేటాయించారు. ఆ నిధులతో రహదారి, బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఎంపీ తన నిధులను వెనక్కి తీసుకున్నారు. బౌద్ధస్తూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో సీఎం కేసీఆర్ ప్రకటించారని పేర్కొంటూ ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎలిగేడు మండల కేంద్రంలో ఒకరోజు నిరాహార దీక్ష కూడా చేపట్టారు.

పిక్నిక్ స్పాట్‌గా..

బౌద్ధస్తూపం పర్యాటకులు, సందర్శకులకు పిక్నిక్ స్పాట్‌గా మారింది. కరీంనగర్ నుంచి కాచాపూర్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ధూళికట్ట వరకు రూ.30 చార్జీతో చేరుకోవచ్చు. పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి జెండాచౌరస్తా మీదుగా రూ.50తో ఆటోలో చేరుకోవచ్చు. ధూళికట్ట చేరుకున్నాక బౌద్ధస్తూపానికి వెళ్లాలంటే కనీసం రెండు కిలోమీటర్లు నడవాలి. సొంత వాహనాలు ఉంటే నేరుగా చేరుకోవచ్చు.

ఏటా జయంతి ఉత్సవాలు

బౌద్ధస్తూపం వద్ద ఏటా మేలో బౌద్ధజయంతిని ఘనంగా నిర్వహిస్తారు. మహారాష్ట్ర నుంచి బౌద్ధసన్యాసులతో ప్రత్యేక పూజలు చేయిస్తారు. బౌద్ధులే ఈ కార్యక్రమాన్ని నిర్వహించి భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ఈనెల 5న బౌద్ధజయంతికి ఏర్పాట్లు చేస్తున్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



నాగభూమిగా పిలిచే బౌద్ధస్తూపం అభివృద్ధితో ఈ ప్రాంతం పర్యాటకంగా మారుతుంది. ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలు చేసుకునేందుకు వనరులు ఉన్నాయి. బౌద్ధ జయంతికి ప్రభుత్వం సహకరించాలి.

– మొగురం రమేశ్, ఉత్సవ కమిటీ చైర్మన్, వడ్కాపూర్

పర్యాటకకేంద్రంగా మార్చాలి



సాక్షాత్తు బుద్ధుడే ఇక్కడ ధ్యానం చేశాడని చరిత్ర చెబుతోంది. బౌద్ధ స్తూపం విశిష్టత, ఈ ప్రాంతానికున్న ప్రాముఖ్యత ముందుతరాలకు తెలి సేలా.. పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలి. ప్రభుత్వం, పర్యాటక శాఖ ముందుకు రావాలి.

– మంచాల వెంకటస్వామి, మాజీ సర్పంచ్, వంగర

సొంత ఖర్చుతో రోడ్డు వేయించా



బౌద్ధస్తూపం వరకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో సొంత డబ్బులు వెచ్చించి మట్టి రోడ్డువేయించా. ప్రస్తుతం ఆ మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. జయంతికి వచ్చేవారి కోసం రోడ్డుతోపాటు కల్వర్టు నిర్మించాలి.

– కొట్టె రాజయ్య, వడ్కాపూర్

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



అతి ప్రాచీనమైన బౌద్ధస్తూపానికి ప్రభుత్వం నిధులు మంజూరుచేసి పర్యాకట కేంద్రంగా తీర్చిదిద్దాలి. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. గత చరిత్రను ప్రజలు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది.

– గొల్లే కావేరి సర్పంచ్, ధూళికట్ట

అభివృద్ధి చేయాలి



అతి పురాతనమైన ధూళికట్ట బౌద్ధ స్తూపాన్ని నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి, ప్రజలు సందర్శించి చూసేందుకు రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు సైతం నిధులు మంజూరు చేయాలి.

– ఇరుగురాల సావిత్రమ్మ, ఎంపీటీసీ, ధూళికట్ట

'పరామర్శకులతో మాట్లాడడం తప్పా'

సిరిసిల్ల: హైకోర్టు షరతులకు లోబడి జిల్లాను వీడిపోకుండా ఉండడం నేరమా అని, అనారోగ్యంతో ఉన్న కూర రాజన్న పరామర్శకులతో మాట్లాడడం తప్పా అని ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించింది. పదినెలల పాటు జైలుకు వెళ్లొచ్చిన కూర రాజన్న సొంత ఇల్లు లేక వేములవాడలో మిత్రుల సహకారంతో సత్రంలో ఉంటే.. పోలీసులు వేధించడం సరికాదన్నారు. కోర్టు విచారణను ఎదుర్కొంటున్న రాజన్న స్థానికంగా ఉండడంతో ఆత్మీయులు, పాత స్నేహితులు వచ్చి కలుస్తున్నారన్నారు. దీన్ని విప్లవ కార్యకలాపాలుగా పోలీసులు చిత్రీకరిస్తున్నారని, కూర రాజన్నపై మరిన్ని తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపే కుట్రగా కనిపిస్తోందన్నారు. ప్రాథమిక హక్కులను గౌరవించాలని వారు కోరారు. స్వేచ్ఛా హక్కుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తేడా ఏంటో బీఆర్‌ఎస్ నేతలు ప్రకటించాలన్నారు. అకాలవర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు సంతోష్, సామ అనసూయ, అల్లూరి విజయ్, పటోళ్ల నాగిరెడ్డి, మల్లేశం, మల్సూర్ కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నాగారంలోని కోదండ రామస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రూ. 80 లక్షలతో రామాలయాన్ని పునర్నిర్మాణం చేపట్టి ప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించారు. బుధవారం యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, పలు కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే రమేశ్ బాబు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, సర్పంచ్ లావణ్య, మాజీ జెడ్పీటీసీ శ్రీకుమార్, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

కోదండ రామస్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు అన్నారు. ఆలయానికి రూ. 80 లక్షలు కేటాయించామని, మరో రూ. 80 లక్షలతో శిథిలమైన ఆంజనేయవిగ్రహాన్ని కూడా పునర్నిర్మిస్తామన్నారు.

రూ.600 కోట్లతో రాజన్న ఆలయాభివృద్ధి

- దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

కోనరావుపేట (వేములవాడ): ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర ఆలయాన్ని రూ. 600 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలం నాగారంలో కోదండ రామస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయానికి మొదలు రూ. 36 లక్షలతో ఆలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంతోపాటు మరో రూ. 50 లక్షలు మంజూరు చేశామన్నారు. సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. నాగారం కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధితో పాటు పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆయన వెంట రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సర్పంచ్ బాస లావణ్య తదితరులున్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

- ఎంపీ బండి సంజయ్


రంజిత్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎంపీ సంజయ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని, విద్యారంగ, ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిని పోలీసులు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారని ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన ఏబీవీపీ రాష్ట్ర హస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేయడంతో జైలు నుంచి విడుదలై ఇంటికి రాగా సంజయ్‌కుమార్ పరామర్శించారు. రంజిత్‌తో పాటు అరెస్ట్ అయిన అక్కెం నాగరాజును పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించకుండా ప్రశ్నించేవారిపై కేసులు పెడుతున్నారన్నారు. నాయకులు లగిశెట్టి శ్రీనివాస్, కనిమెని చక్రధర్ రెడ్డి, బాపురెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులున్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్


కొనుగోలు కేంద్రంలో వినోద్‌కుమార్

కోనరావుపేట (వేములవాడ): అకాల వర్షాలతో రైతులు పంటలను నష్టపోయారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. నాగారంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. వడగళ్ల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు. రైతులు ఇబ్బందులు పడొద్దని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్ రైతుల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అకాలవర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల నష్ట పరిహారం అందించేందుకు సీఎం కేసీఆర్ అంగీకరించారని తెలిపారు. వారివెంట కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, తదితరులున్నారు.

ముగిసిన డ్యాన్స్ శిక్షణ శిబిరం

- చిన్నారులను ప్రోత్సహిస్తేనే రాణిస్తారు
- ఉచిత నాట్య శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో వక్తలు


నృత్యం చేస్తున్న విద్యార్థినులు


బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

సిరిసిల్లకల్చరల్/ సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల అర్బన్: అభిరుచి గల రంగాల్లో చిన్నారులను ప్రోత్సహిస్తే రాణిస్తారనే ఆశయం, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్న సంకల్పంతో సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత డ్యాన్స్ శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసింది. బుధవారం వాసవీనగర్‌లోని ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన శిబిరం ముగింపు సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్, జాగీరు శైలు, సాక్షి ఆర్సీ ఇన్‌చార్జి ఊరడి మల్లికార్జున్, పాఠశాల నిర్వాహకుడు రాజ్‌కుమార్, డ్యాన్స్ మాస్టర్ పొందుర్తి ధర్మేందర్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చిన్నారులు ఆసక్తి గల రంగాల్లో ప్రోత్సహిస్తే రాణిస్తారని తెలిపారు. శిబిరంలో చిన్నారులు పలు సినీ గీతాలపై చేసిన ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

శిక్షణ శిబిరాలు అభినందనీయం

సామాజిక బాధ్యతలో భాగంగా సాక్షి ఇప్పటికే పలు కార్యక్రమాలను నిర్వహించిన సాక్షి తాజాగా వేసవి సెలవులను సద్వినియోగం చేసేందుకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం. ఇలాంటి సమాజ ప్రయోజన కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలి.

– జిందం కళ, మున్సిపల్ చైర్‌పర్సన్

ఆసక్తి గల రంగాల్లో రాణింపు

విద్యార్థులకు వివిధ అంశాల్లో ఆసక్తి ఉంటుంది. అవసరమైన శిక్షణ ఇప్పిస్తే వాటిలో రాణించేందుకు అవకాశం ఉంటుంది. నృత్య శిక్షణ శిబిరం నిర్వహణ ద్వారా విద్యార్థులకు మౌలిక అంశాలతో పాటు నాట్యంపై ఆసక్తి పెరిగింది. సాక్షి మీడియా ప్రతినిధులకు అభినందనలు.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

డ్యాన్స్ అకాడమీకి వసతి కల్పిస్తా

ప్రస్తుతం ఎంతోమంది విద్యార్థులు నాట్యకళపై ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో మూడునెలల పాటు ప్రత్యేకమైన వసతిని నృత్య శిక్షణ కోసం అందజేస్తా. డ్యాన్స్ మాస్టర్లందరూ సద్వినియోగం చేసుకోవాలి. డ్యాన్స్ అకాడమీ రూపకల్పనకు సహకరిస్తా.

– మంచె శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్

ఆసక్తిగా పాల్గొన్నారు

సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత డ్యాన్స్ శిక్షణ శిబిరంలో చిన్నారులు ఆసక్తిగా పాల్గొన్నారు. విద్యార్థులకు సాక్షి తనవంతు సేవలందించడం అభినందనీయమం. మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తే సహకరిస్తాం.

– జాగీరు శైలు, మున్సిపల్ కౌన్సిలర్

సహకారం అందిస్తాం

సెలవుల్లో చిన్నారుల ఆసక్తికి అనుగుణంగా ఉచితంగా డ్యాన్స్ శిక్షణ శిబిరం నిర్వహించిన సాక్షి మీడియాకు అభినందనలు. ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాల నిర్వహణలో ముందుండే సాక్షికి తమవంతు సహకారం అందిస్తాం.

– రాజ్‌కుమార్, కరస్పాండెంట్, ఇంగ్లిష్ యునియన్ హైస్కూల్

డ్యాన్స్ అకాడమీకి సహకరించండి

సిరిసిల్లలో అన్ని సౌకర్యాలను కల్పిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం సంగీత, నాట్య కళలకు సంబంధించిన అకాడమీని కూడా ప్రారంభించి వృత్తి కళాకారులకు చేయూతనివ్వాలి. సిరిసిల్లలో సంగీత నృత్య శిక్షణ సంస్థను ప్రారంభించాలి.

– పొందుర్తి ధర్మేందర్, డ్యాన్స్ మాస్టర్

స్నేహితులను బలిగొన్న డీసీఎం వ్యాన్

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మిత్రుల మృతి
- క్యాటరింగ్‌కు వెళ్లి వస్తుండగా స్కూటీని ఢీకొట్టిన డీసీఎం వ్యాన్
- కన్నీరుమున్నీరవుతున్న మృతుల కుటుంబాలు



నుజ్జునుజ్జయిన డీసీఎం వ్యాన్, స్కూటీ


మొయిన్‌ఖాన్ (ఫైల్)


అభిషేక్ (ఫైల్)

జగిత్యాలక్రైం: ఎండీ మొయిన్‌ఖాన్(21), గోకుల అభిషేక్(22), వరుణ్ సందీప్‌గౌడ్(20) మంచి మిత్రులు.. పేద కుటుంబాలకు చెందిన ఈ ముగ్గురు ఒకవైపు చదుకుంటూనే మరోవైపు తీరిక సమయాల్లో ఎంతోకొంత ఆదాయం ఆర్జించేందుకు శుభకార్యాల్లో క్యాటరింగ్(వంటలు తయారు చేయడం) పనులు చేస్తున్నారు.. తల్లిదండ్రులకూ చేదోడువాదుగా ఉంటున్నారు. భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఎన్నో కలలు కన్నారు. వారి ఆశలను డీసీఎం రూపంలో వచ్చిన మృత్యువు కబళించుకుపోయింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్ శివారులో బుధవారం ఈ ఘటన జరిగింది. బీమారానికి చెందిన ఎండీ మొయిన్‌ఖాన్, రాగోజీపేటకు చెందిన గోకుల అభిషేక్, మేడిపల్లికి చెందిన వరుణ్ సందీప్‌గౌడ్ బుధవారం కొడిమ్యాలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహ వేడుకల్లో వంటలు త యారు చేసేందుకు(క్యాటరింగ్) ఒప్పందం చేసుకు న్నారు. ఈక్రమంలో బుధవారం ఉదయమే అక్క డకు చేరుకున్నారు. క్యాటరింగ్ ప్రక్రియ పూర్తయ్యాక సాయంత్రం తమ ద్విచక్ర వాహనం (స్కూటీ)పై తి రుగు ప్రయాణమయ్యారు. కొడిమ్యాల మండలం కోనాపూర్ శివారులోకి రాగానే ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గోకుల అభిషేక్, ఎండీ మొయిన్‌ఖాన్ మృతిచెందారు. వరుణ్ సందీప్ గౌడ్ పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ యువకుడు మృతి చెందాడు. ఈ ముగ్గురి కుటుంబాలు పేదవి కావడంతో ఎంతోకొంత ఆర్థిక సాయం చేసేందుకు యువకులు క్యాటరింగ్ పనులు ఎంచుకున్నారు. వచ్చిన ఆదాయంలో కొంత వీరి ఖర్చులకు ఉంచుకుని, మిగతా సొమ్ము తల్లిదండ్రులకు ఇస్తూ వస్తున్నారు. ఎదిగి వచ్చిన కొడుకులు తమ బాగోలు చూస్తారని వారి తల్లిదండ్రులు భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ, రోడ్డు ప్రమాదం ఆ ముగ్గురి బలితీసుకుని మూడు కుటుంబాల ఆశలను అడియాసలు చేశాయి. ఆస్పత్రుల్లో కుమారుల మృతదేహాలను చూసిన మృతుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, మిత్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఎటు వెళ్లినా, ఏ పనిచేసినా ముగ్గురు స్నేహితులు కలిసే చేసేవారని, అలాంటి వారిని విధి వక్రీకరించి ఇద్దరని బలితీసుకుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.